

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాల విభజన తర్వాత తొలిసారిగా జరుపుకోనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకుందామని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అధికారులతో పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్ లో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కోవిడ్ ఆంక్షలు లేనందున గత రెండు మూడేళ్లతో పోలిస్తే ఎక్కువగా హాజరయ్యే సాధారణ ప్రజానీకాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలన్నారు. సంక్రాంతి అనంతరం మరోసారి గణతంత్ర దినోత్సవ వేడుకలపై నిర్వహించే సమీక్ష సమావేశం నాటికి శాఖల వారీగా నిర్వహించే కార్యక్రమాలపై ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రతిష్టాత్మక పథకాలను ప్రతిబింబిస్తూ శకటాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, డీఆర్వో గాయత్రీదేవి, ఆన్‌సెట్ సీఈవో కేశవనాయుడు, ఏఆర్ ఏఎస్పీ హనుమంతు, ఆర్డీవో మధుసూదన్, జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, అన్ని శాఖల జిల్లా ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలోని ఆర్టీసీ బస్టాండ్

పండుగ రద్దీ..

స్పెషల్ బస్సులు నడుపుతున్న ఆర్టీసీ ప్రయివేటు ఛార్జీలకు రెక్కలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సంక్రాంతి పండుగ రద్దీ పెరిగింది. విద్యా సంస్థలూ పండుగ సెలవులను ప్రకటించియున్నారు. దీంతో చదువుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు సొంత ఊళ్లకు వచ్చేస్తున్నారు. దీంతో బస్సులకు, రైళ్లకు రద్దీ పెరిగింది. ఉద్యోగ నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు కూడా సంక్రాంతి పండుగ జరుపుకోవడానికి సొంత ఊళ్లకు వస్తున్నారు. ఆర్టీసీ, ప్రయివేటు బస్సులకు డిమాండ్ పెరిగింది. ముందుగా రిజర్వేషన్ చేసుకున్న వారికి సమస్య లేనప్పటికీ, అది లేని వారు బస్సుల కోసం, రైళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నారు.

అనంత రిజియన్‌లో 182 స్పెషల్ బస్సులు

పండుగ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అనంతపురం రీజియన్ నుంచి 182 స్పెషల్ బస్సులను జనవరి 6వ తేది నుంచే నడుపుతోంది. ఈనెల 18వ తేదీ వరకు ఈ స్పెషల్ బస్సులు నడపాలని నిర్ణయించింది. హైదాబారద్‌కు 41 బస్సులు, బెంగళూరుకు 41, విజయవాడకు ఏడు, తిరుపతికి ఏడు, చెన్నైకి మూడు, నెల్లూరుకు ఒకటి చొప్పున నడుపుతున్నారు. మొత్తం ప్రస్తుతం 95 బస్సులు నడుపుతుండగా, అదనంగా అవసరమైన మరో 87 బస్సులు నడిపేందుకు కూడా సిద్ధంగానున్నట్టు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ రకంగా నడుపుతున్నప్పటికీ డిమాండ్ ఉన్న రూట్లు ఏవైనా ఉంటే అందులోనే నడిపేందుకు సిద్ధంగానున్నట్టు చెబుతున్నారు. పండుగ సమయాల్లో ఆర్టీసీ ఇది వరకు ఛార్జీలను పెంచేది. కాని ఈసారి పండుగ సమయాల్లోనూ సాధారణ ఛార్జీలతోనే నడిపాలని ఇప్పటివరకు భావిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

ప్రయివేటు బాదుడే..

ప్రయివేటు ట్రావెల్స్ మాత్రం పెరిగిన డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. ఛార్జీలను 10 నుంచి 20 శాతం పెంచేందుకు సిద్ధపడ్డాయి. హైదరాబాద్, విజయవాడకు అధికంగా ప్రయివేటు సర్వీసులు నడుస్తున్నాయి. జిల్లా నుంచి సుమారు 10 సర్వీసులు నడుస్తున్నాయి. వీటికి డిమాండ్ కూడా ఉండటంతో బస్సు ఛార్జీలను పెంచుతున్నాయి. ఈ బస్సుల్లోనూ రద్దీ పెరిగింది.

రవాణా శాఖ స్పెషల్ డ్రైవ్

పండుగ సమయాల్లో ప్రయివేటు ట్రావెల్స్ ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నాయన్న ఆరోపణలపై రవాణా శాఖ దృష్టి సారించింది. గడిచిన రెండు రోజులుగా రవాణా శాఖ అధికారులు బస్సుల తనిఖీలు చేపడుతున్నారు. అధిక ఛార్జీలు వసూలు చేస్తే చర్యలుంటాయని రవాణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు జిల్లాలో అధిక ఛార్జీలు వసూలు చేసిన వారిపై చర్యలేవీ తీసుకున్న దాఖలాల్లేవు. అయితే సరుకు రవాణా చేస్తున్న వాటిపై జరిమానాలు విధించారు.

ఇళ్ల స్థలాలు ఇస్తారా..స్వాధీనం చేసుకోమంటారా..?

రూ.కోట్ల విలువజేసే ప్రభుత్వ భూములు కాజేస్తుంటే పట్టదా

మహాధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'జిల్లాలో అర్హులైన నిరుపేద కుటుంబాలు ఇళ్లు లేక అద్దె ఇళ్లలో నివసిస్తున్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించి ఇస్తామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. నాలుగేళ్లు కావస్తోంది. కొందరికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. స్థలం చూపలేదు. మరికొందరికి ఇళ్లు మంజూరు చేశారు. కొందరికే నిర్మించారు. ప్రభుత్వంపై ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూశారు. ఐదేళ్లైనా ఇళ్లు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి పేదలందరికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేస్తే సరి.. లేకపోతే ప్రజలను కలుపుకుని ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని పంచిపెడతాం'.. అని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అన్నారు. అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాలు, గ్రామాల్లో అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు, సాగుభూమి పట్టాలు మంజూరు చేయాలని, జగనన్న కాలనీల్లో వేగవంతంగా ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం అనంతపురం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో 39 వేల ఇళ్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇప్పటి వరకు 3,600 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారని విమర్శించారు. జగనన్న కాలనీలు గ్రామాలకు దూరంగా శ్మశానవాటికలు, వంకల పక్కన ఏర్పాటు చేశారని తెలిపారు. తొలుత ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇస్తుందని హామీ ఇచ్చి తరువాత అనేక నిబంధనలు తీసుకొచ్చి గ్రహణం పట్టించారని దుయ్యబట్టారు. రూ.1.80 లక్షలతో లబ్ధిదారులే ఇల్లు కట్టుకోవాలంటే సాధ్యమయ్యే పరిస్థితి లేదన్నారు. నామ మాత్రంగా ప్రభుత్వమే నిర్మించే ఇళ్లు తక్కువ సంఖ్యలో ఉంటున్నాయని, సొంతంగా కట్టుకోవాలనుకుంటే లబ్ధిదారులు ముందురాని పరిస్థితి ఉందన్నారు. గ్రామాలు, పట్టణాలకు సమీపంలోనే ప్రభుత్వ భూములు ఉన్నా సుదూర ప్రాంతాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు చూపడం విడ్డూరంగా ఉందన్నారు. రూ.కోట్ల విలువజేసే ప్రభుత్వ భూములను కబ్జాదారులు దోచుకుంటుంటే చోద్యం చేస్తురా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుత్తిలో 8 సంవత్సరాలుగా పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తుంటే కొందరు నకిలీ పత్రాలు సృష్టించి వారిని ఖాళీ చేయించే కుట్ర చేశారని తెలిపారు. దీంతో పేదలు కోర్టును ఆశ్రయించారని తెలిపారు. పరిశీలించిన కోర్టు తప్పుడు పత్రాలు సృష్టించిన సదరు వ్యక్తిని అరెస్టు చేసి, పేదలకు కోర్టు కేసులకు తిరిగి ఖర్చు అయిన డబ్బుల్లో రూ.10 వేలు చొప్పున చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, సదరు అధికారిని సస్పెండ్ చేయాలని తీర్పు వెలువరించిందన్నారు. ఇప్పటివరకు ఆ స్థలంలో తహశీల్దార్ అడుగు కూడా పెట్టని పరిస్థితి ఉందన్నారు. అనంతపురం రూరల్ పరిధిలో ప్రభుత్వ భూమి అని పూర్తిగా విచారించుకున్న తరువాతనే పేదలు గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. అయితే కొందరు రైతుల పేర్లతో తప్పుడు పత్రాలు సృష్టించి ఆ భూమిని అప్పనంగా ఎకరా రూ.55 లక్షలు చొప్పున విక్రయించేందుకు అగ్రిమెంట్‌లు చేసుకున్నారని అన్నారు. రెవెన్యూ అధికారులు పరిశీలన చేయమంటే పెళ్లి చూపులకు వచ్చినట్లు వెళ్లి వచ్చిరే తప్ప అది ప్రభుత్వ భూమి, ప్రయివేటు భూమి అని తేల్చలేదన్నారు. దీన్ని బట్టి పేదలంటే ప్రభుత్వానికి, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పట్టనట్లు ఉందన్నారు. అధికారులు కబ్జాదారులు ఇచ్చే కాసులకు కక్కుర్తిపడి రాత్రికి రాత్రే తప్పుడు పత్రాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. కూడేరులో సెస్పెండ్ అయిన తహశీల్దార్ లాగా 11 మంది ఉన్నారన్నారు. ఆధారాలు కూడా ప్రభుత్వానికి ఇస్తామన్నారు. గతంలో పనిచేసిన ఆర్‌డిఒ 18 ఎన్‌ఒసిలు మంజూరు చేశారని గుర్తు చేశారు. ప్రజలను, ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించే అధికారుల పట్ల ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. అలాంటి వారి జాబితా ఇవ్వమన్నా తాము ఇచ్చేందుకు సిద్ధం అన్నారు. కబ్జాదారులు ఇచ్చే కోట్ల రూపాయలు కావాలో, ప్రజలు కావాలో ప్రభుత్వం తేల్చుకోవాలని సవాల్ విసిరారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇళ్ల స్థలాలు, పట్టాలు, ఇళ్ల నిర్మాణాలు, సాగుపట్టాలు ఇచ్చి ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించడంలో ఉన్న శ్రద్ధ ప్రభుత్వ భూములను కాపాడటంలో అధికారులు చొరవ చూపాలన్నారు. రాజీవ్ కాలనీలో 4-8ఎ, 4-7ఎ2, 4-7ఎ3, 4-7ఎపి, 4-7ఎ1, 4-7ఎపి, 58-5, 58-6 సర్వే నెంబర్లలో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలన్నారు. అనంతపురం, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, కూడేరు, శింగనమల మండలాల్లో పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజలకు న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. అనంతరం ఆర్‌డిఒ మధుసూదన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర 2వ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు, జిల్లా నాయకులు క్రిష్ణమూర్తి, గోపాల్, మన్నీల రామాంజినేయులు, తరిమెల నాగరాజు, వలి, ప్రకాష్, మసూద్, బాబు, గపూర్, ఎంపిటిసి సభ్యులు రమీజాబీ, రాజు, వెంకటేష్, ఇర్ఫాన్, కుళ్లాయప్ప, చెన్నారెడ్డి, పోతులయ్య, రామాంజి, సూరి, ఎన్టీఆర్ శీనా, రజక సంఘం నాగభూషణ, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్ర యాదవ్, డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, రాజు, ఆటో యూనియన్ నాయకులు శివ, ఆది, నాగరాజు, ఆజామ్, మున్సిపల్ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ, ఎటిఎం.నాగరాజు, ఎర్రిస్వామి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం : ఆర్డీవో

సచివాలయాల ఉద్యోగులు ఆయా గ్రామాల్లోని లబ్ధిదారుల అర్జీలు పరిశీలించి అర్హులైన వారందరికి ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో మధుసూదన్ సిపిఎం నాయకులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ భూములా, ప్రయివేటు భూములా త్వరలోనే తేల్చేస్తామన్నారు. ప్రభుత్వ భూములైతే స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.



అర్ధనగ్నంగా నడుముకు ఆకులు కట్టుకుని నిరసన తెలుపుతున్న హమాలీలు

కూలి రేట్లు పెంచాలని హమాలీల వినూత్న నిరసన

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

సివిల్ సప్లై గోడౌన్ల వద్ద లోడింగ్, అన్‌లోడింగ్ చేసే హమాలీలకు కూలిరేట్లు పెంచడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, తక్షణమే పెంచిన కూలిరేట్ల జీవోను విడుదల చేయాలని హమాలీలు డిమాండ్ చేశారు. పెంచిన కూలి రేట్లు ఇవ్వాలని తాడిపత్రి పట్టణంలోని పప్పూరు రోడ్డు నందు ఉన్న సివిల్ సప్లై గోడౌన్ ఎదుట సివిల్ సప్లై హమాలీలు బుధవారం వినూత్నంగా నిరసన తెలిపారు. అర్ధనగ్నంగా నడుముకు ఆకులుకట్టుకుని నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ.. ఆరు నెలల క్రితమే పాత కూలి రేట్ల అగ్రిమెంటు ముగిసిందన్నారు. అయితే ఇంతవరకు కూలి రేట్లు పెంచలేదన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి పౌర సరఫరాల శాఖను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. 2022 జనవరి నుంచి పెరిగిన కొండి రేట్ల అరియర్స్ చెల్లించాలని, పిఎఫ్‌కు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే పెంచిన కూలిరోట్ల జీవోను విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. పెంచిన కూలిరేట్ల జీవో విడుదల చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఉమా గౌడ్, హమాలీ యూనియన్ నాయకులు సూరి, శ్రీనివాసులు, కుమార్, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

15లోపు ఇకెవైసి చేయించుకోండి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్



పొలంబడి వివరాలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్

బుక్కరాయసముద్రం : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్‌నిధి కోసం అర్హులైన రైతులు ఈనెల 15వతేదీలోపు తప్పకుండా ఇకెవైసి చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్ సూచించారు. బుధవారం మండలంలోని పి.కొత్తపల్లిలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎం కిసాన్ సొమ్ము రూ.6వేలు పడాలంటే రైతులు ఇకెవైసి చేయించుకోవాలన్నారు. కాగా వేరుశనగలో మిత్ర, శత్రు పురుగులను గుర్తించాలన్నారు. శత్రు పురుగులు శాతం ఎక్కువగా ఉంటేనే పురుగు మందులు వాడాలన్నారు. ముఖ్యంగా వేప కషాయం, పుల్లటి మజ్జిగను స్ప్రే చేసుకోవాలన్నారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే పంగళ కర్రలు, లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రబీ సీజన్‌లో లద్దె పురుగు ఉధృతి ఉండే అవకాశం ఎక్కువగా ఉన్నందున కిలో బెల్లం పాకానికి 10 కిలో వరితవుడు, మోనోక్రోటోఫాస్‌ను ఉండలుగా చేసి పొలంలో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పసలూరు సర్పంచి భర్త చిన్నపరెడ్డి, పొలంబడి రైతు శివారెడ్డి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు శంకరలాల్‌నాయక్, రుమనాబేగం, ప్రవీణ్‌కుమార్, విత్తనధ్రువీకరణ సంస్థ అధికారి రవి, మండల వ్యవసాయాధికారి శ్యాంసుందర్‌రెడ్డి, రైతుభరోసా కేంద్రం ఇన్‌ఛార్జిలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యను బలోపేతం చేయడమే పిఎంశ్రీ పాఠశాలల ఉద్దేశం

డిఇఒ వెంకటకృష్ణారెడ్డి



విద్యార్థినితో మాట్లాడుతున్న డిఇఒ వెంకటకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

మౌలికవసతులు కల్పించి సాంకేతిక సొబగులతో ప్రభుత్వ పాఠశాల విద్యను తీర్చిదిద్దడమే కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పాఠశాలల లక్ష్యమని కడప ఆర్‌జెడి, అనంతపురం డిఇఒ మార్తాల వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం అనంతపురం రూరల్ మండలంలోని కురుకుంట ఎస్సీ రెసిడెన్షియల్ స్కూల్‌ని ఆర్‌జెడి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులకు నాణ్యమైన విద్యనందడానికి, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాలను సక్రమ అమలుచేసేందుకు పాఠశాలలపై విస్తృత తనిఖీలు చేపట్టామన్నారు. ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా తమ పాఠ్యాంశాలకు సంబంధించి పాఠ్యప్రణాళిక, టీచింగ్ డైరీని కలిగివుండాలన్నారు. తమ సబ్జెక్టులకు సంబంధించి ప్రతి విద్యార్థి చేతా వర్క్ బుక్ పూర్తి చేయించాలన్నారు. నోట్ బుక్స్ విద్యార్థులు రాశారా లేదా పరిశీలించి తప్పనిసరిగా సంతకం చేయాలన్నారు. సమ్మేటివ్ పరీక్ష పత్రాలను దిద్ది పర్సనల్ మార్కులు రిజిస్టర్‌లో వెంటనే నమోదు చేయాలన్నారు. ఆయా పరీక్షల్లో విద్యార్థులు చేసిన తప్పులను తెలియజెప్పి సరిదిద్దాలన్నారు. ప్రతి విద్యార్థికీ అన్ని టెక్స్ట్ బుక్స్ బైలింగువల్ పద్ధతిలో అందాయా లేదా అని ప్రధానోపాధ్యాయులు సరి చూసుకోవాలన్నారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చేటప్పుడు తప్పనిసరిగా జగనన్న విద్యా కానుక బ్యాగ్ వంటివి తప్పక కలిగివుండాలన్నారు. జగనన్న గోరుముద్దకు సంబంధించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందేలా చూడాలన్నారు. నాడు-నేడు ఫేజ్ 1 స్కూల్స్‌లో తాగునీటి ప్లాంట్ పనిచేసే విధంగా చూసుకోవాలని, ప్రతి పాఠశాలలో కంప్లైంట్ బాక్స్, అందరికీ కనిపించే విధంగా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శించిన వారిపై చర్యలు తప్పవన్నారు. అనంతరం నాడు-నేడు కింద నిర్మించిన షెడ్యూల్‌ని చూసి ప్రిన్సిపల్ సునీతని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ వెంకటస్వామి, ఎఎంఒ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన ప్రాజెక్టుల నిధులతో వర్శిటీ మరింత అభివృద్ధి

జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన



మాట్లాడుతున్న జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

అధ్యాపకులు సాధించే ప్రాజెక్టుల నిధులతో అనంత జెఎన్‌టియు మరింత అభివృద్ధి సాధిస్తుందని, అందుకు అనుగుణంగా యువ ఉపాధ్యాయులు పరిశోధన ప్రాజెక్టులు సాధించాలని ఉపకులపతి రంగజనార్ధన పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక వర్శిటీ డైరెక్టరేట్ అఫ్ స్పాన్సర్డ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో పరిశోధన ప్రాజెక్టులకు నిధులు ఎలా సాధించాలి.. ఎలా దరఖాస్తు చేయాలన్న అంశంపై ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాపు నిర్వహించడం వల్ల యంగ్ ప్యాకల్టీకి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా అధ్యాపకులకు పరిశోధన ప్రతిపాదనలోని వివిధ ఇబ్బందులను ఎలా అధిగమించాలో దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి రీసోర్స్‌పర్సన్‌గా విచ్చేసిన శాస్త్రవేత్త, ఢిల్లీ జి.డిపార్ట్‌మెంట్ అఫ్ సైన్సు అండ్ టెక్నాలజీ రాజీవ్ కె.తాయల్ పరిశోధన ప్రతిపాదనలు వివిధ పెండింగ్ ఏజెన్సీలకు ఎలా పంపాలో వివరించారు. అలాగే రీసెర్చ్ సమస్యను ఎలా గుర్తించాలి.. ప్రతిపాదనలో ఎలా రాయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్ మెంట్ అఫ్ సైన్సు అండ్ టెక్నాలజీ, రీసెర్చ్ అడ్వైజర్ డాక్టర్ జి.ఆర్.ప్రసాదరాజు, డైరెక్టర్ ఆర్.పద్మ సువర్ణ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆర్.భవానీ, అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల, పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలలు, కలికిరి ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి.. వివేకానందుడి జీవితం

ఉరవకొండ : స్వామి వివేకానంద జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ నాగరత్నమ్మ అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని పాఠశాల వద్ద నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా యోగా, వేదాంతల్లో అమెరికా, ఇంగ్లాండ్ తదితర ప్రపంచ దేశాలలో భారత దేశం పేరు ప్రతిష్టలను కీర్తింప చేసిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద అని కొనియాడారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రామకృష్ణ మిషన్ ఏర్పాటు చేసి ప్రపంచవ్యాప్తంగా యోగా, వేదాంత శాస్త్రాలతో ఎంతోమంది ప్రజలకు మానసిక ప్రశాంతత పొందేందుకు కృషి చేశారన్నారు. అంతేగాకుండా స్వామి వివేకానందకు భారతదేశం అంటే ఎంతో ఇష్టమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవీంద్రారెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి



ఫారంపాండ్‌ను పరిశీలిస్తున్న డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి

కళ్యాణదుర్గం : ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలంలోని పాలవాయి గ్రామంలోని రైతుల పొలాల్లో చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనులను పీడీ పరిశీలించారు. ఇందులో భాగంగా కూలీల రోజువారి హాజరు పట్టిక, మేట్లు, ఫీల్డు, టెక్నికల్ అసిస్టెంట్ల పనితీరు, బిల్లుల మంజూరు తదితర అంశాలపై ఆరాతీశారు. డీ మస్టరు నమోదు చేస్తేనే కూలీలకు రోజువారి బిల్లులు అందుతాయని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బంధనల మేరకు పనులు చేయాలన్నారు. పనుల్లో నాణ్యత లోపించినా, అక్రమాలు చోటుచేసుకున్నా బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపిడి రమేష్‌నాయక్, ఎంపిడిఒ బాలాజీ, ఎపిఒ ఓబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి దగ్గర పడిన రోజులు : టిడిపి

గుత్తి : అవినీతి, అరాచకాలు, దౌర్జన్యాలకు పాల్పడుతున్న వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని టిడిపి బీసీ సెల్ అధికార ప్రతినిధి ఆర్.పవన్ గౌడ్, సీనియర్ నాయకులు కెసి హరి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో బుధవారం మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్.ఇసాక్ సాబ్ ఆధ్వర్యంలో ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. సీఎం జగన్ నియంతలా వ్యవహరిస్తూ ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో కక్షలు సృష్టించాలని చూస్తున్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనిల్‌గౌడ్, పట్టణ కన్వీనర్, రవిశంకర్‌గౌడ్, ఎంపిటిసి నారాయణస్వామి, జిలాన్, దిల్కా సినా, కిట్ట, మాజీ సర్పంచులు వెంకటరాముడు, నరసింహులు, తిరుపాలు, బేతాపల్లి అగ్గిరాముడు, రమేష్, వంకాయల సీనా, గోవర్ధన్‌గౌడ్, కొత్తపేట టిడిపి నాయకులు చంద్ర, కదిరప్ప, సూరి, కంబయ్య, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్నకు నివాళి

బొమ్మనహాల్ : స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్న జయంతిని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలో చిత్రపటాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా వడ్డే ఓబన్న దేశం కోసం చేసిన సేవలను కొనియాడారు. అనంతరం అన్నదాన చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డే కుల సంఘాల నేతలు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలో స్థానిక వడ్డెర కాలనీలో స్వాతంత్ర్య ఉద్యమ యోధుడు వడ్డెర ఓబన్న జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భావన నిర్మాణ సంఘం మండల కార్యదర్శి వి.వెంకటశేఖర్, నాయకులు వెంకట నారాయణ, సుబ్బయ్య, మల్లీ,హరి,రాజుకు మార్, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని పురస్కరించుకుని బుధవారం ఉరవకొండలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందరంగా వడ్డెర సంఘం నాయకులు మాట్లాడుతూ వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. అంతేగాకుండా ఓబన్న విగ్రహం ఏర్పాటుకు పట్టణంలో స్థలాన్ని కేటాయించాలని, వడ్డెర్లకు 50 సంవత్సరాలకే పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం చేరుకుని తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర కులసంఘం నాయకులు ప్రభాకర్ శంకరయ్య, గంగరాజు, లాలుస్వామి, చినబాబు పెద్ద సంఖ్యలో వడ్డెర్లు పాల్గొన్నారు.

ఆత్మకూరు ఎస్ఐగా రంగడుయాదవ్ బాధ్యతల స్వీకరణ

ఆత్మకూరు : ఆత్మకూరు ఎస్ఐగా రంగడుయాదవ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ డి.శ్రీనివాసులును శింగనమలకు బదిలీ చేయగా అనంతపురం త్రీటౌన్‌లో విధులు నిర్వహిస్తున్న రంగడుయాదవ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ప్రత్యేకాధికారి శ్రీమన్నారాయణ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఉపాధ్యాయులు తప్పకుండా సమయ పాలన పాటించి ఉన్నత విద్యాబోధన చేయాలని మండల ప్రత్యేకాధికారి శ్రీమన్నారాయణ సూచించారు. బుధవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలతోపాటు అంగన్‌వాడీ, సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా నాణ్యమైన భోజనం అందిస్తున్నారా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం రుచి చూశారు. తర్వాత అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి గర్భిణీలు, పిల్లలకు మెనూప్రకారం ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం ఇస్తున్నారా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ఇవ్వాల్సిన గుడ్లు, పాలు, గర్భిణులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ టీచర్‌కు సూచించారు. తర్వాత గ్రామ సచివాలయం చేరుకుని సిబ్బంది హాజరు, మూమెంట్ రికార్డులను పరిశీలించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని, వైఎస్ఆర్ గ్రామక్లినిక్‌ను పరిశీలించి, త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ గురుప్రసాద్, ఇఒఆర్‌డి దామోదరమ్మ, హౌసింగ్ ఎఇ రాజశేఖర్‌రెడ్డి, ఐసిడిఎస్ అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీమన్నారాయణ

బిటిపి కాలువలకు నీరందించాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జీడిపల్లి నుంచి కాలువల ద్వారా భైరవానితిప్ప ప్రాజెక్టుకు నీరు అందించాలని రాయలసీమ విద్యావంతుల వేదిక, అనంత హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక వివేకానంద ప్రయివేటు కళాశాలలో ఆర్‌విపి ఉమ్మడి అనంతపురం జిల్లా కన్వీనర్ గోచర్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో రైతులతో భూనిర్వాసితుల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్ల వైసిపి పాలనలో అరచకాలు, దాడులు, దౌర్జన్యాలు మినహా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం జరగలేదని దుయ్యబట్టారు. ముఖ్యంగా భూసేకరణ చేసి ఏళ్లు గడుస్తున్నా రైతులకు పరిహారం అందించకపోవడం, కాలువలు తవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. అన్నిరంగాల్లో ప్రభుత్వం వైఫల్యం చెందటంతోపాటు రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని విమర్శించారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న రాయలసీమ విద్యావంతుల వేదిక, అనంత హక్కుల పోరాట సమితి నాయకులు

ఎంఎస్ రాజు అరెస్టు బాధాకరం

టిడిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, అధికార ప్రతినిధి డేగల

ప్రజాశక్తి-శింగనమల

ప్రజ సమస్యలపై పోరాడుతున్న టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజును అరెస్టు చేయడం బాధాకరమని టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు ఆవుల క్రిష్ణయ్య, అధికార ప్రతినిధి డేగల కృష్ణమూరి ఖండించారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో చలో కావలి కార్యక్రమానికి పిలుపునిస్తే రాజుతోపాటు టిడిపికి చెందిన దళిత నేతలను ఎక్కడికక్కడ అరెస్టు చేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా కార్యదర్శి చిన్న పెద్దన్న, జిల్లా బీసీ సెల్ కార్యవర్గ కార్యదర్శి, కొయ్యగూర పెద్దన్న, మాజీ ఎంపిటిసి చిక్కెల్ల చంద్రాయుడు, నియోజకవర్గ బీసీ సెల్ కార్యదర్శి లోలూరు నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతన్న టిడిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు అధ్యక్షుడు కృష్ణయ్య, అధికార ప్రతినిధి డేగల

జగనన్న తోడు చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో జగనన్న తోడు పథకం కింద మంజూరైన చెక్కులను సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాల్లో భాగంలో మహిళలకు జగనన్న తోడు పథకాన్ని ప్రవేశపెట్టి మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యోగేశ్వరి, ఎంపిడిఒ నిర్మలాకుమారి, వైసిపి మండల కన్వీనర్ పట్నం నగేష్, కెనరా బ్యాంకు మేనేజర్ రమేష్, ఎపిఎం నారాయణస్వామి, సిసిలు రంగప్ప, నాగేష్, నారాయణస్వామి, సుబ్బరాయుడు, విఒఎలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.


విడపనకల్లులో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపిపి పుష్పావతి

ఉరవకొండ : మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి అన్నారు. బుధవారం విడపనకల్ మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో జగనన్న తోడు ఆరో విడత కింద లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ చిరువ్యాపారులు, సంప్రదాయ వృత్తుల వారికి ఆరోవిడత కింద ఒక్కొక్కరికి కొత్తగా 444 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు కరణం భీమిరెడ్డి, ఎపిఎం ఆంజనేయులు, సీసీ తిమ్మారెడ్డి, ఎంపిటిసిలు తిమ్మరాజు, ఓబులేసు, విడపనకల్ ఉపసర్పంచి, యానిమేటర్లు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండలానికి 415 మందికి రూ.41.5లక్షలు మంజూరైనట్లు ఎంపిపి తిప్పమ్మ తెలిపారు. బుధవారం జగనన్న తోడు 6వ విడత ప్రారంభ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని బుధవారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ మండలానికి సంబంధించి జగనన్న తోడు పథకం కింద కొత్తగా 415 మందికి 41.5 లక్షలు, వడ్డీ రాయితీ 1,071 మందికి రూ.2,64,000 మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నాగేశ్వరరావు, జడ్పీ వైస్‌ఛైర్మన్ వేదాంతం నాగరత్నమ్మ, సహకార సొసైటీ ఛైర్మన్ లోకనాథరెడ్డి, ఎంపిడిఒ దివాకర్, ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహా, ఎపిఎం తిప్పమ్మ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రేఖ, లబ్ధిదారులు, సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.


శింగనమలలో చెక్కులు పంపిణీ చేస్తున్న బొమ్మన శ్రీరామిరెడ్డి, ఎంపిడిఒ నిర్మలాకుమారి

బాలోత్సవాలను జయప్రదం చేయండి

గుత్తి : ఈనెల 27, 28, 29వ తేదీల్లో అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న బాలోత్సవాలను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం పట్టణంలోని ఎంఇఒ కార్యాలయంలో ఎంఇఒ బి.రవినాయక్ ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంత బాలోత్సవాలకు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేట్, కార్పొరేట్ విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ మండల కార్యదర్శి గౌతమ్ నాయక్, నాయకులు రవి, కృష్ణ, రవి, బాషా తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న భూరక్ష'పై అవగాహన

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంపై బుధవారం సమీక్ష సమావేశం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో భూసర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లు టీంలుగా ఏర్పడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి జి.లక్ష్మినరసింహ, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ షేక్షావలి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సందీప్, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ సురేష్‌బాబు

పుట్లూరు ఎస్ఐ వెంకటప్రసాద్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పుట్లూరు

మండల ఎస్ఐగా వెంకటప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న గురుప్రసాద్‌రెడ్డిని అనంతపురం స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేసి నార్పలలో విధులు నిర్వహిస్తున్న వెంకటప్రసాద్‌ను ఇక్కడికి నియమించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కాగా ఎస్ఐను పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ రాజశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు సురేష్, ఆదినారాయణ, శ్రీనివాసులు, షేక్షావలి, వెంకటరమణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కనకదాస విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలో భక్త కనకదాస విగ్రహం ఏర్పాటుకు డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డితోపాటు కురుబ సంఘం నాయకులు బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీరామిరెడ్డి మాట్లాడుతూ కురుబ సంఘం నాయకులు విగ్రహం ఏర్పాటుకు స్థలం కావాలని విన్నవించడంతో మండల కేంద్రంలోని బ్రహ్మంగారి గుడి పక్కన స్థలం కేటాయించడానికి రెవెన్యూ అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు, వైసిపి మండల కన్వీనర్ పట్నం నగేష్, పట్నం శివయ్య, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిముల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ప్రతి ముస్లిం కృషి చేయాలని ముస్లిం మైనార్టీ ఐక్యవేదిక నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం పట్టణంలోని చెర్లోపల్లి కాలనీలో ఉన్న నిజామీ షాదీఖానాలో ముస్లిం ఐక్య వేదిక ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ కమిటీ నాయకులు కౌన్సిలర్ నజీర్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఫయాజ్, రాష్ట్ర విశ్రాంత పెన్షనర్ల సంఘం అధ్యక్షులు కె. అబుబకర్, కోకో కోలా జీలాన్, ప్రజా వైద్యశాల ఇస్మాయిల్, సఫా బైతుల్ మాల్ అధ్యక్షులు ఎండి అబ్దుల్ హక్, డిష్ అన్వర్, సికందర్ మాట్లడుతూ పట్టణంలోని పేద ముస్లిం కుటుంబాలను ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. నూతన కమిటీ ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలను చేపడుతామన్నారు. కమిటీ అధ్యక్షుడుతో పాటుగా సభ్యులు ముస్లిం కుటుంబాలకు సేవకులుగా పని చేయాలన్నారు. కమిటీకి అధ్యక్షుడిగా ఎన్నికైన వారు మరింత బాధ్యతగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అజీజ్, కటిక అన్వర్, గౌరా మాబు, ముల్లా రషీద్, సుంకం రఫిక్, గుత్తి ఆర్ ఎస్ కు చెందిన రియాజ్, ఖాజా ఖాన్, యూసుఫ్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ముస్లిం మైనారిటీ ఐక్యవేదిక నాయకులు

సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని మూడవ రోడ్డులో ఉన్న సాయివిజ్ఞాన్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ముగ్గులు వేయించారు. తెలుగు సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించే క్రమంలో తమ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించనట్లు పాఠశాల డైరెక్టర్లు కరుణాకర్ బాబు శ్రీనివాసులు ప్రిన్సిపల్ లావణ్య రామ్ తెలిపారు. అలాగే స్థానిక రుద్రంపేట బైపాస్‌లో ఉన్న శ్రీచైతన్య పాఠశాల ఏటిపి-10 బ్రాంచ్, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలను ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలను శ్రీచైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమములో ప్రిన్సిపాళ్లు సమీనాఖాన్, తబస్సు, కలందర్, విశ్వనాథ్, శాంతకుమారి, పర్వీన్‌భాను, నేత్రావతి, స్వరూపరాణి, జోనల్ ఇన్‌ఛార్జి పూజ, జోనల్ కోఆర్డినేటర్ తిరుమలేష్, డీన్ సతీష్, ప్రైమరీ ఇన్‌ఛార్జి సరిత, ఏవో విజయకృష్ణ, డాన్స్ మాస్టర్ విష్ణు, డ్రాయింగ్ మాస్టర్ మధుకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సాయి విజ్ఞాన్ పాఠశాలలో భోగి మంటలు వేస్తున్న అధ్యాపకులు

పుట్లూరు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా కడవకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలతోపాటు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

కణేకల్లు : మండల పరిధిలోని ఎర్రగుంట గ్రామ సమీపంలోని బళ్లారి-కళ్యాణదుర్గం ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... బళ్లారి నుంచి అనంతపురానికి వెళ్తున్న టాటా ఏసీ వాహనాన్ని వెనకవైపు నుంచి ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో 1, 9వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. గమణించిన చుట్టుపక్కల వారు క్షతగాత్రులను హుటాహుటిన బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలిస్తుండగా 1వ తరగతి చదువుతున్న సంతోష్ (6) మార్గమధ్యంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లాల్‌బహదూర్ శాస్త్రి వర్ధంతి

రాయదుర్గం : భారత మాజీ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి ఆదిలక్ష్మి, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు బద్రీనారాయణ, పాఠకులు, పాల్గొన్నారు.

బధిర పాఠశాలను సందర్శించిన ఆర్డీవో

రాయదుర్గం : పట్టణంలోని భంభం స్వామి ఆశ్రమం వద్ద ఉన్న వికలాంగ, బధిరుల పాఠశాలను ఆర్డీవో నిశాంత్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఇందులో భాగంగా వికలాంగులు, బధిరుల ఆరోగ్య పరిస్థితులు, వారికి లభిస్తున్న వసతి, సేవలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లలకు తినుబండారాలు అందజేశారు. ఆయన వెంటన వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తదితరులు ఉన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు

గుత్తి : క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కె.మధుసూదన్‌గుప్తా అన్నారు. బుధవారం స్థానిక పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయం, వయస్సు పోతే తిరిగి రావని విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని చెప్పారు. ఉన్నత స్థాయికి చేరుకొని దేశాభివద్ధికి తోడ్పాటున అందించాలన్నారు. అనంతరం కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తర్వాత మాజీ ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, సీఈవో ఎ.శ్రీరాములు, పిఆర్‌ఆర్ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్, అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి : ఎస్ఐ

నార్పల : మండల కేంద్రంలోని గూగూడు రోడ్డు, సంత మార్కెట్ రోడ్డు, బస్టాండ్ కూడలి తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు, వాహనదారులు సహకరించాలని ఎస్ఐ రాఘవరెడ్డి కోరారు. మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని దుకాణదారులు, హోటల్ నిర్వాహకులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించుకుని ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ దుకాణదారులు తమ దుకాణాల ఎదుట వాహనాలను ఉంచుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా నార్పల స్టేట్ బ్యాంక్ సమీపంలో ఎక్కడ పడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారన్నారు. అలాంటి వాహనాల ఫొటోలు తీసి అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు.

మలకాపురంలో 'గడప గడపకూ'

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మలకాపురం గ్రామంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విప్ కాపు రామచంద్రారెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి విద్యావతి, జెడ్పీటీసీ మల్లికార్జున, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

14న బంజరా మహిళలకు ముగ్గుల పోటీలు

అనంతపురం కలెక్టరేట్ : నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆల్ ఇండియా బంజరా సేవాసంఘ్ ఆధ్వర్యంలో ఈనెల 14న జిల్లాలోని బంజారా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఎఐబిఎస్‌ఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలాజీనాయక్, బాబూనాయక్ తెలిపారు. బుధవారం నగరంలోని బంజారా భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈనెల 14న 2వ రోడ్డులోని బంజారా భవన్‌లో ఉదయం 9 గంటలకు బంజారా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని గిరిజన మహిళలు అందరూ పాల్గొనవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో ఎఐబిఎస్‌ఎస్ గౌరవాధ్యక్షులు అశ్వర్థనాయక్, బాలునాయక్, ఉపాధ్యక్షులు రంగ్లానాయక్, సలహాదారులు శేఖర్‌నాయక్, క్రిష్టానాయక్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలతోనే చిన్నారులకు బంగారు భవిష్యత్


చిన్నారులతో మాట్లాడుతున్న సర్పంచి బ్యాలా రాణి

ఉరవకొండ : అంగన్‌వాడీ కేంద్రాలు భావి భారత పౌరుల బంగారు భవిష్యత్తుకు పునాది కేంద్రాలని పాల్తూరు సర్పంచి బ్యాలా రాణి రాజశేఖర్ అన్నారు. బుధవారం విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరులో ఉన్న 5, 6వ అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ సెంటర్లు ఏర్పాటు చేసి చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేయడమే కాకుండా వారి విద్యాభ్యాసానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీల్లోని రికార్డులను తనిఖీ చేసి చిన్నారులకు అందిస్తున్న భోజన పదార్థాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, నాగవేణి, హెల్పర్లు పాల్గొన్నారు.

గో పిజ్జా బ్రాంచ్ ప్రారంభం



అనంతపురం కలెక్టరేట్ : అత్యంత ప్రాచుర్యం పొందిన దక్షిణ కొరియన్ హెచ్క్యు పిజ్జా బ్రాండ్ సంస్థ నూతన సంవత్సర ప్రారంభంతో గోపిజ్జా బ్రాంచ్‌ను అనంతపురంలో బుధవారం ప్రారంభించారు. ఈ ఔట్‌లెట్‌ను హైదరాబాద్ బెంగళూరు హైవేపై క్యూబ్ షాప్ వద్ద ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవానికి నటి మధుషాలినీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశపు మార్కెట్‌లో వేగంగా విస్తరించాలని ప్రణాళిక చేసిన గోపిజ్జా, అనంతపూర్‌లో ఈ ఔట్‌లెట్ ప్రారంభించడం ద్వారా తమ తొలిఅడుగు వేసిందన్నారు. దీనితో పాటుగా హైదరాబాద్ హైటెక్ సిటీ వద్ద కూడా ఓ ఔట్‌లెట్ ప్రారంభించిందన్నారు. భారతదేశ వ్యాప్తంగా 100 నిర్వహణలోని ఔట్‌లెట్‌లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దక్షిణ కొరియాలో ఈ సంస్థ ఫౌండర్ జే వోన్ (జే) లిమ్ యొక్క ఫుడ్ ట్రక్ వద్ద ఓ ఆలోచనలా ప్రారంభమైన ఈ పిజ్జా ఇప్పుడు దక్షిణ కొరియా, సింగపూర్, ఇండోనేషియా, ఇండియా హాంగ్‌కాంగ్‌లలో 200కు పైగా స్టోర్లతో ఎక్కువ మంది అభిమానించే పిజ్జా బ్రాండ్‌గా నిలిచిందన్నారు. గోపిజ్జా తమ నాణ్యత, ప్రామాణికతను ప్రతి ప్రాంతంలోనూ నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా గోపిజ్జా ఇండియా సీఈఓ మహేష్ రెడ్డి మాట్లాడుతూ "అనంతపూర్‌కు గోపిజ్జాను తీసుకురావడం పట్ల చాలా సంతోషంగా ఉందన్నారు.కేవలం తాజా పదార్థాలు మాత్రమే వాడడంతో పాటుగా మా వినూత్నమైన ఫ్లేవర్స్‌ను అత్యంత సరసమైన ధరలలో అందిస్తున్నట్లు తెలిపారు.